క్లుప్తంగా

అమ్మవారికి బలసాని పూజలు



గుంటూరు రూరల్: దసరా పండుగను పురస్కరించుకుని వాడవాడలా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. బుధవారం 48వ డివిజన్ రెడ్డిపాలెం గ్రామంలో దసరా నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా, రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పోలేరమ్మ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆదేవిధంగా 41వ డివిజన్ స్వర్ణభారత్‌నగర్ రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్స్ నందు దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో బలసాని పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాభవాని అమ్మవారి కమిటీ ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా డివిజన్‌ల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసు

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో కూటమి నేతల ఒత్తిడితో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు జరిగింది. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మూకిరి సామియేలు గత నెల 23వ తేదీన జరిగిన తిరునాళ్ల భోజన కార్యక్రమంలో తనను కులంపేరుతో దూషించి, బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వైఎస్సార్ సీపీకి చెందిన అంజిరెడ్డి, సాంబిరెడ్డి, పోలిరెడ్డి, కేశవరెడ్డిలపై స్థానిక ఎస్ఐ పి.వీరనారాయణలపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు వైఎస్సార్ సీపీ నాయకులను ఇబ్బందులకు గురి చేయటం కోసమే ఎస్సీ కులానికి చెందిన మూకిరి సామియేలు చేత పోలీసులకు ఫిర్యాదు చేయించినట్లు వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

ఏఎన్‌యూ పర్యాటక విభాగానికి అవార్డుపై హర్షం



పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పర్యాటక ఆతిథ్య నిర్వహణ విభాగానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అథారిటీ ప్రతిష్టాత్మక ఉత్తమ పర్యాటక విద్యా సంస్థ అవార్డు – 2025 లభించడం అభినందనీయమని వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఈ అవార్డును సెప్టెంబర్ 27 విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందుకున్నామన్నారు. అవార్డు వచ్చిన సందర్భంగా బుధవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ మెంబర్స్ వర్సిటీ అధికారులను కలిశారు. ఈ సందర్భంగా వీసీ కె.గంగాధరరావు మాట్లాడుతూ పర్యాటక విద్య, పరిశోధన విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఈ విభాగం చేస్తున్న విశేష కృషి ప్రశంసనీయమన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఓఎస్డీ ఆర్ఎస్ఎస్ రవికుమార్, ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్, ప్రొఫెసర్ పూర్ణచంద్రరావుల కృషిని కొనియాడారు. అధ్యాపక సభ్యులు రహిమాన్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ గీతా సోని, డాక్టర్ రాజేష్, డాక్టర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానం

గుంటూరు మెడికల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఒకరు చేసే రక్తదానంతో నలుగురి ప్రాణాలు కాపాడవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం గుంటూరు జీజీహెచ్ బ్లడ్‌బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు పాల్గొన్నారు.

తోడిన నీళ్లే.. మళ్లీ మళ్లీ తోడి..!

- ఆగస్టులో వర్షాలకు పెదకాకాని మంచినీటి చెరువుకు గండి
- మంచినీటి చెరువులో కలిసి గ్రామంలోని మురుగునీటి చెరువు
- రెండు నెలలుగా రంగు మారిన, దుర్వాసన వస్తున్న నీరే దిక్కు
- మంచినీటి చెరువు నుంచి 8 ఇంజిన్లతో నీరు తొలగిస్తున్న అధికారులు
- ప్రతి ఏటా చెరువు నీరు బయటకు పెట్టేందుకు నిధులు ఖర్చు చేస్తున్న అధికారులు
- శాశ్వత పరిష్కార చర్యలకు వెనకడుగు



మంచినీటి చెరువు నీటిని బయటకు వదులుతున్న దృశ్యం

పెదకాకాని: రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు అధ్వానంగా ఉండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన పెదకాకాని గ్రామంలో సుమారు 30 వేల మంది జనాభా ఉన్నారు. 5000 మంచినీటి కుళాయిలతో పాటు 100 పబ్లిక్ కుళాయిలు ఉన్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు నిలయమైన పెదకాకానిలో శివాలయం, బాజీబాబా దర్గా, క్రైస్తవ స్వస్థిశాల (కాకాని తోట) ఉన్నాయి. ప్రతినిత్యం పుణ్యక్షేత్రాలకు దూర ప్రాంతాలకు నుంచి భక్తులు వస్తూ ఉండారు. పంచాయితీకి ఆదాయం, నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ ఆ స్థాయిలో వనరులు సమకూర్చడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ వహించడం లేదు. దీంతో రెండు నెలలుగా ప్రతి రోజూ గ్రామంలో రంగుమారిన నీరు, దుర్గంధ పూరిత నీరే సరఫరా అవుతోంది.

శాశ్వత పరిష్కారంపై శ్రద్ధ ఏదీ?

మురుగు చెరువు పక్కనే ఉన్న రజక చెరువు నీరు ప్రతి సారి మురుగు చెరువుకు చేరడం, ఆ చెరువు కట్ట ఎక్కడ తెగి మంచినీటి చెరువుకు చేరుతుందోనని నీటిని బయటకు పెట్టడం తరచూ జరుగుతూనే ఉంది. వాస్తవానికి రజకచెరువులోని మురుగునీరు సమీపంలోని వడ్డెర కాలనీ ముందు ఉన్న మురుగు చెరువుకు చేరేలా కాలువ ఏర్పాటు చేసి పక్కనే ఉన్న మురుగు కాలువ ద్వారా ఆ నీటిని తరలించడానికి అవకాశం ఉంది. ప్రతి ఏటా తాత్కాలిక చర్యలు తీసుకుంటూ నిధులు ఖర్చు చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం దిశగా మాత్రం ఆలోచించడం లేదు. ఇప్పటికైనా మురుగు చెరువు నీరు మంచినీటి చెరువుకు చేరకుండా సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రమైన త్రాగునీరు సరఫరా చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

రెండేళ్లుగా ఇదే తంతు..!

పెదకాకాని మంచినీటి చెరువు పక్కనే మురుగునీటి చెరువు ఉంది. ఈ చెరువుకు గ్రామంలోని మురుగునీరంతా వచ్చి చేరుతూ ఉంటుంది. పెద్ద వర్షం పడిన ప్రతిసారి మురుగు చెరువు కట్ట తెగి మంచినీటి చెరువులోకి చేరడం పరిపాటిగా మారింది. ఈ ఏడాది ప్రతిపక్షనాయకులు, ప్రజా సంఘాలు, గ్రామ ప్రజలు ఉన్నతాధికారులను కలసి ఫిర్యాదు చేయడంతో చెరువు కట్టకు పడిన గండి పూడ్చేందుకు ముందుగా మురుగుచెరువు నీటిని ఏడు ఇంజిన్ల సాయంతో బయటకు తోడారు. ఆ తరువాత చెరువుకట్టకు మరమ్మతులు చేశారు.



పెదకాకానిలో మురుగు చెరువు నీటిని బయటకు పెడుతున్న అధికారులు

- తరువాత మురుగునీటితో కలుషితమైన మంచినీటి చెరువులో దాదాపుగా తొమ్మిది కరెంట్ ఇంజిన్‌లు, ట్రాక్టర్ ఇంజిన్లు అమర్చి నీటిని బయటకు పెడుతున్నారు. వర్షం రావడం మురుగు చెరువు నిండటం.. ఆ నీటిని కరెంటు మోటార్లు అమర్చి బయటకు పెట్టడం పనిగా పెట్టుకున్న పంచాయతీ అధికారులు శాశ్వత పరిష్కారానికి మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

వ్యవసాయ యంత్రాలపై జీఎస్టీ తగ్గింపు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏడీఏ రామకోటేశ్వరి

పొన్నూరు: వ్యవసాయ యంత్ర పరికరాలైన ట్రాక్టర్లు, పరికరాలు, టైర్లపై 18 శాతం నుంచి 5 శాతం వరకు జీఎస్టీ తగ్గడంతో ధరలు తగ్గి రైతులకు ప్రయోజనకరంగా మారిందని ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని నిడుబ్రోలు, వడ్డిముక్కలలో వ్యవసాయ శాఖ, వాణిజ్య పన్నుల శాఖ, పట్నంబజార్ సర్కిల్ ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాల తగ్గింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నూర్పిడి యంత్రాలు, సాగు యంత్రాలు, స్ప్రింకర్లు, బిందు సేద్య పరికరాలు, చేతి పంపులు, కంపోస్టింగ్ యంత్రాలకు 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గాయని తెలిపారు. వస్తు కొనుగోలు సమయంలో జీఎస్టీ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. ఎస్‌జీఎస్టీ డెప్యూటీ కమిషనర్ ఎల్.రాధిక, అధికారులు ప్రసాదు, ఏజీకే కిషోర్, వై.పద్మజ, ఏఓ ఆర్.వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో...

గుంటూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ రేటును 12శాతం నుంచి 5శాతానికి తగ్గించడం ద్వారా రైతులకు గణనీయమైన లాభం చేకూరిందని మండల వ్యవసాయ అధికారి కిషోర్ తెలిపారు. బుధవారం జొన్నలగడ్డ గ్రామంలో ఏర్పాటు చేసిన జీఎస్టీపై రైతు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దీని వల్ల ఒక ట్రాక్టర్‌పై సుమారు రూ 85,000, రోటావేటర్‌పై రూ 21,000, విత్తనాలపై రూ 9,000, దున్నే పరికరాలపై రూ 10,000 వరకు రైతులకు ఆదా అవుతుందన్నారు. ఈ సూపర్ సేవింగ్స్‌పై మండలంలోని అన్ని గ్రామాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, డీపీఎం రాజకుమారి, రైతు సోదరులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

• మహిషాసురమర్దనిగా జగజ్జనని



ప్రత్తిపాడులో మహిషాసుర మర్దని అవతారంలో అమ్మవారు



విద్యుద్దీపకాంతులతో మెరిసిపోతున్న అమ్మవారి ఆలయం



వెనిగండ్ల శ్రీవేణుగోపాల స్వామి ఆలయం వద్ద..



పెదకాకాని రజకపాలెం వద్ద ..

అయిగిరి నందిని నందిత మోదిని విశ్వవినోదిని విశ్వనుతే... గిరివర వింధ్య వినోదిని వాసిని విష్ణువిలాసిని జిష్ణునుతే.. భగవతి హేశితికంఠ కుటుంబిని భూరినుతే.. జయజయహే మహిషాసుర మర్దిని రమ్యకపర్దిని శైలసుతే.. అంటూ అమ్మవారిని భక్తి ప్రపత్తులతో భక్తజనం పూజించారు. దేవీ శరన్నవరాత్రులలో భాగంగా పదవ రోజైన బుధవారం ఆదిపరాశక్తి స్వరూపమైన అమ్మవారు మహిషాసురమర్దనిగా భక్తులచే విశేషపూజలందుకున్నారు.

– ప్రత్తిపాడు/ గుంటూరు రూరల్ /చేబ్రోలు/పెదకాకాని/పొన్నూరు



నంబూరు శ్రీనాగారపమ్మ దేవాలయ ప్రాంగణంలో..



వెనిగండ్ల పంచాయతీ కార్యాలయం వద్ద..



పొన్నూరు శ్రీ కోదండ రామాలయంలో..



శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి దేవాలయంలో..



నల్లపాడు శ్రీ అగస్త్యేశ్వరాలయంలో కనకదుర్గాదేవి



మంచాల గ్రామంలో మహిషాసురమర్ధని అలంకారంలో..



ఆదికేశవస్వామి దేవస్థానంలో ప్రత్యేక అలంకారంలో..



ప్రత్తిపాడు వేణుగోపాల స్వామి దేవాలయంలో..

వృద్ధుల హక్కులు కాపాడాలి



వృద్ధులకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ప్రత్తిపాడు: వృద్ధుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ ప్రవీణ్ అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎన్) పరిధిలోని వృద్ధుల ఆరోగ్య సంరక్షణ జాతీయ కార్యక్రమం (ఎన్‌పిహెచ్‌సీఈ) లో భాగంగా వృద్ధులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ప్రవీణ్‌తో పాటు ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ నివేదిత, జనరల్ సర్జన్ డాక్టర్ పావనిలు వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ నెల రోజుల పాటు జరిగే కార్యక్రమంలో వెయ్యి మంది వృద్ధులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, చూపు, వినికిడి, ఎముకలు, కీళ్లకు సంబంధించిన పరీక్షలు చేస్తామని వివరించారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ నివేదిత, జనరల్ సర్జన్ డాక్టర్ పావని మాట్లాడుతూ వృద్ధులు తాము ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలపై అలసత్వం వహించకుండా త్వరితగతిన చికిత్స పొందడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండగలరని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

పొన్నూరు: వృద్ధాప్యంలో ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ఫిరోజ్ ఖాన్ అన్నారు. బుధవారం పట్టణంలోని సీహెచ్‌సీలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య రక్షణకు వృద్ధాప్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై డాక్టర్ ఫిరోజ్ ఖాన్ వృద్ధులకు అవగాహన కల్పించారు. పండ్లు పంపిణీ చేశారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడిగా పొగాకు కొనుగోళ్లు

నాణ్యత లేదంటూ ధరల్లో కోత..

పెదకాకాని: పొగాకు కొనుగోలు బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించిన మాటలు నీటి మూటలుగా మారాయి. నాణ్యత లేదంటూ ప్రభుత్వం ధరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. నాసిరకం పేరుతో మరికొంత తిప్పి పంపిస్తున్నారు. పొగాకు కొనుగోళ్లు లేవని సోమ, మంగళ వారాల్లో వచ్చిన రైతులను తిప్పి పంపించడంతో అదనపు బాడుగ చెల్లించాల్సి వచ్చింది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెదకాకాని సెంట్రల్ వేర్‌హౌస్ గోడౌన్‌ల నందు పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది. మొదటి రకం క్వింటా రూ. 12 వేలు, రెండవ రకం రూ. 9 వేలు, మూడవరకం రూ.6 వేలు చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించారు. బయ్యర్లు సోమ, మంగళవారాలు రాకపోవడంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. సరుకుతో పెదకాకాని సెంట్రల్ వేర్‌హౌస్ వద్దకు చేరుకున్నాక , కొనుగోళ్ళు లేవని చెప్పడంతో రైతులు నిరాశతో వెనుతిరిగారు. సరుకు తరలించిన వాహనాలకు బాడుగ చెల్లించాల్సి వచ్చింది.



నాణ్యత పేరుతో వెనక్కి పంపిస్తున్న పొగాకు బేళ్ళు

బాడుగులకే సరిపోతోంది..



22 క్వింటాలు పొగాకు తీసుకు వస్తే 16 క్వింటాలు మాత్రమే కొన్నారు. 6 క్వింటాలు సరుకు నాశిరకంగా ఉందని వెనక్కి పంపిస్తున్నారు. బాడుగలకు ఎక్కువ మొత్తంలో పెట్టాల్సి వస్తుంది.

– వల్లెపు సుబ్బారావు, పొగాకు రైతు కొండ్రుపాడు.